క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన


ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో

కెరమెరి: మండలంలోని కొఠారి గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని బుధవారం ఎంపీడీవో అంజద్‌పాషా పరిశీలించారు. ఆ గ్రామంలో మంజూరైన ఇళ్లతో పాటు ఇప్పటివరకు కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణ వివరాలను పంచాయతీ కార్యదర్శి సతీశ్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. స్థాయిల వారీగా ఫొటోలు అప్‌లోడ్ చేయాలని సూచించారు. లబ్ధిదారులకు నష్టం కలగకుండా ఉండాలంటే నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణాలు చేపట్టాలన్నారు.

టీఎస్ యూటీఎఫ్ నూతన కార్యవర్గం


మాట్లాడుతున్న రాజ్‌కమలాకర్ రెడ్డి

పెంచికల్‌పేట్: టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీని బుధవారం సంఘం జిల్లా కార్యదర్శి రాజ్ కమలాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాయికుమార్, ఉపాధ్యక్షులుగా నికాడి కిషోర్, మహిళా అధ్యక్షురాలిగా ఎస్.కవిత, ప్రధాన కార్యదర్శిగా అనిల్‌కుమార్, కోశాధికారిగా మల్లన్న, కార్యదర్శులుగా ఆర్.తిరుపతి, సమతా కుమారి, శ్రీధర్‌లను ఎన్నుకున్నారు.

సమన్వయంతో ఇసుక అక్రమ రవాణా అరికట్టాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ సూర్య ప్రకాశ్

రెబ్బెన: రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖలు సమన్వయంతో పని చేసి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని తహసీల్దార్ సూర్య ప్రకాశ్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మైనింగ్, పోలీస్‌శాఖ అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని వాగుల నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న నేపథ్యంలో అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుంటే టోకెన్లను జారీ చేస్తామన్నారు. మైనింగ్ ఏడీ గంగాధర్, ఎస్సై చంద్రశేఖర్, ఆర్‌ఐ ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

జీఎం దంపతులకు సన్మానం

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఏరియా జీఎం విజయ భాస్కర్ రెడ్డి, సేవా సమితి అధ్యక్షురాలు పద్మ విజయ భాస్కర్‌రెడ్డిలను ఘనంగా సన్మానించారు. అధికారుల సంఘం నాయకులు మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా రక్షిత నీటి కోసం ఇబ్బంది పడిన గోలేటిటౌన్‌షిప్ వాసులకు జీఎం ప్రత్యేక కృషితో సురక్షిత తాగునీటి అందుతోందన్నారు. సంఘం అధ్యక్షుడు నరేందర్, ఎస్‌వోటూజీఎం రాజమల్లు, డీజీఎంలు ఉజ్వల్‌కుమార్‌బెహరా, కృష్ణమూర్తి, ప్రాజెక్టు ఇంజనీరు వీరన్న, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు సన్మానం

రెబ్బెన: ఆటో నడుపుతూ ఇద్దరు కుమార్తెలను ప్రయోజకులుగా తీర్చిదిద్దిన తల్లిదండ్రులను బుధవారం గోలేటిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గోలేటికి చెందిన గుల్బం శ్రీనివాస్ ఆటో నడుపుకుంటూ ఇద్దరు కుమార్తెలను ఉన్నత చదువు చదివించారు. వారు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ప్రభుత్వ కొలువు సాధించడం సులువు కాదన్నారు. శ్రీనివాస్ దంపతులు నేటితరం తల్లిదండ్రులకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో ఆర్టీఏ మెంబర్ లావుడ్య రమేశ్, మాజీ జెడ్పీటీసీ పల్లె ప్రకాశ్‌రావు, నాయకులు కొవ్వూరి శ్రీనివాస్, కిషన్‌గౌడ్, రవీందర్, పూదరి హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులతో కలిసి ఆందోళన

బెజ్జూర్: రైతుల సమస్యలు పట్టని ఎమ్మెల్యే ఉన్నా.. లేకున్నా ఒక్కటేనని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంలో బుధవారం రైతులకు యూరియా అందడంలేదని తెలిసి వారితో కలిసి ఆందోళన చేపట్టారు. ఆఫీసులో యూరియా కోసం బారులుదీరిన అన్నదాతలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మండల బీఆర్‌ఎస్ కన్వీనర్ సారయ్య, ఖాజా, ఫసి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వరుణుడు కరుణించేనా..? వరి సాగయ్యేనా..?


ఎండిపోతున్న పెద్ద చెరువు ఆయకట్టు పరిధి నారుమడి


ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు నికాడి వెంకన్న. మండల కేంద్రానికి చెందిన ఈయనకు పెద్ద చెరువు కింద సాగు చేస్తున్న ఎకరం వరి పొలం ఉంది. ఖరీఫ్ ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా భారీ వర్షాలు జాడ లేకపోవడం, చెరువులోకి వరద రాకపోవడంతో ఇంకా నారుమడి సిద్ధం చేయలేదు. అసలు ఈ ఏడాది వరి సాగయ్యేనా అని ఆందోళన చెందుతున్నాడు. ఒక్క వెంకన్ననే కాదు మండలంలో చెరువులు, కుంటల కింద సాగు చేస్తున్న రైతులందరి పరిస్థితి ఇదే విధంగా ఉంది.

- వెలవెలబోతున్న చెరువులు, కుంటలు
- ఖరీఫ్ ప్రారంభమై నెల రోజులు
- వర్షాలు లేక ఇబ్బందుల్లో అన్నదాతలు
- దహెగాంలో లోటు వర్షపాతం

దహెగాం: ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే నైరుతి ముందస్తు వచ్చి వర్షాలు మురిపించాయి. ఈ యేడు వర్షాలు సంవృద్ధిగా కురుస్తాయని వాతావరణ శాఖ కూడా పేర్కొంది. కానీ పరిస్థితి అందుకు భిన్నంగానే ఉంది. నెల రోజులైనా భారీ వర్షాలు జాడ లేకపోవడం, గత వారం రోజుల నుంచి ఎండలు మండి పోతున్నందున వరిసాగు పనులు ముందుకు సాగడం లేదు. బోర్ల సౌకర్యం ఉన్న వారు నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. చెరువులు, కుంటల కింద సాగు చేసే పొలాలు బీళ్లుగానే కనిపిస్తున్నాయి. దీంతో అన్నదాతలు అయోమయంలో పడ్డారు.

బీళ్లుగా వరి పొలాలు..

మండల కేంద్రంలోని పెద్ద చెరువు, చింతపాటి చెరువు, కర్జి చెరువు కింద ఆయకట్టు వరి పొలాలు బీళ్లుగానే దర్శనమిస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు కావస్తున్న కేవలం ఒక్క భారీ వర్షం మాత్రమే కురిసింది. అప్పటి నుంచి అడపదడపా వర్షాలు కురుస్తున్నాయి. పొలాల్లో నీళ్లు నిలవ్వకాక పోవడంతో వరి సాగు పనులు ముందుకు సాగడం లేదని రైతులు పేర్కొంటున్నారు. పొలాలు బీళ్లుగా ఉన్నాయని సమయం మించిపోతోందని ఆందోళన చెందుతున్నారు.

9,800 ఎకరాల్లో వరి సాగు..

మండలంలో ప్రధానంగా పత్తి సాగు ఉంది. తరువాత స్థానంలో వరి 9,800 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. బోర్లు, బావుల సౌకర్యం ఉన్న వారు నారుమడులు సిద్ధం చేసుకుని మొలక వేశారు. వర్షాలు జాడ లేకపోవడంతో చెరువులు, కుంటల్లో నీరు చేరకపోవడంతో ఆయకట్టు భూములు బీళ్లుగానే ఉన్నాయి. గత సంవత్సరం ఈ సమయానికి వరినాట్ల పనులు జోరుగా కొనసాగాయని ఈ సంవత్సరం ఇంకా మొలక అలకలేదని వాపోతున్నారు. కొందరు మొలక అలకినా వర్షాలు లేక నారుమడులు ఎండి పోతున్నాయంటున్నారు.

వరుణుడి కోసం..

భారీ వర్షాలు జాడ లేకపోవడంతో మండల రైతులు వరుణుడి కోసం ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు. మండలంలో వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి 396.5 మిల్లీమీటర్ల వర్షపాతం కురువాల్సి ఉండగా 287.7 మిల్లీ మీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. దీంతో లోటు వర్షపాతం 27గా ఉంది. దీంతో సాగు పనులు ముందుకు సాగడం లేదని రైతులు వాపోతున్నారు.

సమయం మించిపోలేదు

వరి నాట్లకు సమయం మించి పోలేదు. ఆగస్టు మొదటి వారం వరకు నాట్లు వేసుకోవచ్చు. భారీ వర్షాలు లేనందున వరిసాగు పనులు ముందుకు సాగడం లేదు. రానున్న రెండు, మూడు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ చెబుతోంది. పత్తికి వర్షాలు అనుకూలంగానే ఉన్నాయి. వర్షాలు కురిసిన తరువాత వరి సాగు పనులు మొదలు పెట్టాలి. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలి.

– రామకృష్ణ, వ్యవసాయాధికారి, దహెగాం

ఉపాధిహామీ పనులపై ప్రజావేదిక


ఉపాధిహామీ పనుల వివరాలు పరిశీలిస్తున్న అధికారులు

సిర్పూర్(టి): మండలంలోని గ్రామాల్లో 2024 –25 సంవత్సరానికి గాను నిర్వహించిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులపై బుధవారం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల వారీగా నిర్వహించిన పనులు, కూలీలకు చెల్లించిన డబ్బుల వివరాలను తెలుసుకున్నారు. పనుల నిర్వహణలో, లెక్కల్లో తేడా రావడం, పనుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఉపాధిహామి సిబ్బందికి రికవరీ, పెనాల్టీ విధించారు. మండలంలో ఉపాధిహామీ పథకం ద్వారా 385 పనులు చేపట్టగా రూ. 45,19,861 కూలీలకు కూలీ డబ్బులు చెల్లించారని, పంచాయతీ రాజ్ శాఖ ద్వారా 48 సీసీరోడ్లు నిర్మించగా రూ. 20,850 కూలీ డబ్బులు చెల్లించామని, అటవీశాఖ ఆధ్వర్యంలో ఒక్క పని నిర్వహించగా రూ.99,617 కూలీ డబ్బులు చెల్లించినట్లు తెలిపారు. మండలంలో మొత్తం రూ.64,773 రికవరీ చేస్తున్నట్లు, రూ.8000 పెనాల్టీ వేసినట్లు డీఆర్‌డీవో దత్తారావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, హెచ్‌ఆర్ మల్లేష్, ఎస్‌టీఎం వేణు, ఎస్‌ఆర్‌పీ శైలు, ఏపీవో చంద్రయ్య, పంచాయతీ కార్యదర్శులు, స్థానికులు పాల్గొన్నారు.

చదవడం, రాయడం రావాలి


విద్యార్థులను చదివిస్తున్న హెచ్‌ఎం

కెరమెరి: ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం రావాలని ఎంఈవో ఆడే ప్రకాశ్ అన్నారు. బుధవారం మండలంలోని కల్లెగాం గిరిజన ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పరిశీలించారు. విద్యార్థులను పాఠ్య పుస్తకాలను చదివించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. రికార్డులు సరైన విధంగా నమోదు చేయాలని తెలిపారు. ఎస్సీఆర్పీ చహకటి శ్యాంరావు, హెచ్‌ఎం నైతం నారాయణ ఉన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్

లింగాపూర్: పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో మండలస్థాయి వాలీబాల్ క్రీడాపోటీలను నిర్వహిస్తున్నట్లు సీఐ రమేశ్, ఎస్సై గంగన్న తెలిపారు. ఎస్పీ కాంతీలాల్ పాటిల్, ఏఎస్పీ చిత్తరంజన్‌దాస్ ఆదేశాల మేరకు జైనూర్, లింగాపూర్, సిర్పూర్(యూ) మండలాలకు చెందిన వారికి పోటీలు నిర్వహిస్తున్నామని, ఆసక్తి గల వారు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

నేడు కెరమెరిలో..

కెరమెరి: కెరమెరి పోలీసుల ఆధ్వర్యంలో గురువారం వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఎస్సై మధుకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం పోలీస్‌స్టేషన్‌కు తమ టీంతో రావాలని పేర్కొన్నారు.

కేంద్ర మంత్రికి వినతుల వెల్లువ

జిల్లా పర్యటనకు వచ్చిన కేంద్ర సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రాకు వివిధ సమస్యలు పరిష్కరించాలని జిల్లావాసులు వినతులు సమర్పించారు.


వాంకిడి: వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

బస్‌షెల్టర్లు నిర్మించాలని వినతి

వాంకిడి: మంచిర్యాల నుంచి మహారాష్ట్ర సరిహద్దు వరకు నిర్మించిన ఎన్‌హెచ్ –363పై అసంపూర్తిగా వదిలేసిన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని వాంకిడి పర్యాటనకు వచ్చిన కేంద్ర సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రాకు బీజేపీ వాంకిడి మండల అధ్యక్షుడు చీదర్ల నరేష్, బీజేవైయం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎలగతి సుచిత్ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. హైవే నుంచి మేజర్ గ్రామ పంచాయతీలకు వెళ్లే కనెక్టివిటి రోడ్ల వద్ద బస్ షెల్టర్‌ల నిర్మాణం చేపట్టాలని, అసంపూర్తిగా వదిలేసిన సైడ్ డ్రెయిన్‌లను పూర్తి చేయాలని వినతి పత్రం ద్వారా కోరారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. బీజేపీ వాంకిడి శాఖ ఆధ్వర్యంలో మంత్రిని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బిజేపి నాయకులు రామగిరి విశాల్, సోయం సంజీవ్, సోమేశ్వర్, మండోకార్ వికాస్, వేణు, గొల్ల, నరేందర్, కార్తిక్ ఉన్నారు.

మాలీలను ఎస్టీల్లో చేర్చాలి

ఆసిఫాబాద్: మాలి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ కేంద్ర సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రాకు బుధవారం జిల్లా కేంద్రంలో జిల్లా మాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నాగోశ శంకర్ మాట్లాడుతూ తాము ఆంధ్రప్రదేశ్‌లో ఎస్టీలుగా, తెలంగాణలో బీసీలుగా ఉన్నామన్నారు. గిరిజన రిజర్వేషన్లు 10 శాతానికి పెంచి, ఎస్టీ జాబితాలో కలపాలని కోరారు. కావుడె దత్తు, శెండె సోమేశ్వర్, నాగేశ సాగర్, గుర్నులె మారుతి, కొట్రంగి సాగర్, మోహర్లె శ్రీకాంత్ ఉన్నారు.

జీవో 49 రద్దు చేయాలి

జీవో 49ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు కొట్నాక విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కేంద్ర సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రాకు వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 49 ఎలాంటి తీర్మానాలు లేకుండా ఆదివాసీ గ్రామాలను ఖాళీ చేసే కుట్రలు చేస్తుందన్నారు.

బాధిత రైతులను కలిసిన సహాయ మంత్రి

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలో నూతనంగా ప్రారంభించనున్న గోలేటి ఓసీపీలో భూములు కోల్పోతున్న సోనాపూర్ గ్రామ రైతులను బుధవారం కేంద్ర సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా కలిశారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రేతో కలిసి కైరిగూడ ఓసీపీ వైపు వెళ్తుండగా మార్గమధ్యలో సోనాపూర్ గ్రామం వద్ద ఆగారు. గిరిజన రైతుల సమస్యలు తెలుసుకున్నారు. రైతులు మాట్లాడుతూ పరిహారం విషయంలో సింగరేణి యాజమాన్యం అన్యాయం చేస్తోందని అన్నారు. ప్రస్తుత మార్కెట్‌లో రూ.20లక్షలకు పైగా ధర ఉండగా.. సింగరేణి యాజమాన్యం కేవలం రూ.2.25లు మాత్రమే ఉందని చూపుతూ, దాని ప్రకారమే రెండు రేట్లు పెంచి పరిహారం అందించాలని చూస్తోందని తెలిపారు. ఓసీపీలో ముంపునకు గురయ్యే భూమి ఎకరానికి రూ.60 లక్షలతోపాటు సింగరేణిలో ఉద్యోగం ఇవ్వాలని కోరారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్, గ్రామస్తులు దొందేరావు, భీమ్‌పటేల్, భగవంత్ రావు, మధుకర్‌గౌడ్ పాల్గొన్నారు.

హైవే సమస్యలు పరిష్కరించాలని..

మంచిర్యాల టూ మహారాష్ట్ర సరిహద్దు వరకు మండల కేంద్రం మీదుగా నిర్మించిన నేషనల్ హైవే రోడ్డు సమస్యలను పరిష్కరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు మల్రాజు రాంబాబు బుధవారం కేంద్రమంత్రి హర్ష్ మల్హోత్రాకు వినతిపత్రం అందజేశారు. గోలేటిలోని సింగరేణి గెస్ట్‌హౌస్‌లో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. రాంబాబు మాట్లాడుతూ మండలంలోని ఎడవెల్లి, పులికుంట గ్రామాల్లో సర్వీసు రోడ్లను ఏర్పాటు చేయాలన్నారు. ఆంజనేయులుగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి సతీశ్ పాల్గొన్నారు.


ఆసిఫాబాద్: వినతిపత్రం సమర్పిస్తున్న మాలి సంఘం నాయకులు


వినతిపత్రం సమర్పిస్తున్న తుడుందెబ్బ నాయకులు

వార్డుల్లో సమస్యల తిష్ట


గాంధీనగర్‌లో రోడ్డుపై చెత్తాచెదారం

- కన్నెత్తి చూడని వార్డు ఆఫీసర్లు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో వార్డు ఆఫీసర్లు కన్నెత్తి చూడకపోవడంతో వార్డుల్లో సమస్యలు తిష్టవేస్తున్నాయి. పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాగజ్‌నగర్ మున్సిపల్ పరిధిలో 30 వార్డులు సుమారు 80వేల జనాభా ఉంది.

పట్టింపులేని అధికారులు..

మున్సిపాలిటీలో వార్డు ఆఫీసర్లు వారికి కేటాయించిన వార్డుల్లో సందర్శించిన దాఖలాలులేవు. మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో ఎవరైనా జిల్లా అధికారి, ప్రజాప్రతినిధులు వస్తే మాత్రం పరిసరాలను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లిస్తున్నారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నప్పటికీ ఫలితం శూన్యం. ప్రధాన రహదారులతోపాటు అంతర్గత రోడ్లలో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. మున్సిపాలిటీకి ప్రత్యేక అధికారి ఉన్నప్పటికీ ఒక్కసారి కూడా వార్డుల్లో పర్యటించలేదని ఆరోపణలు ఉన్నాయి. వార్డుల్లో నెలకొన్న సమస్యలను ప్రత్యేకాధికారి దృష్టికి తీసుకెళ్లాలన్నా కాలనీ ప్రత్యేకాధికారి ఎవరో కూడా తెలియని పరిస్థితి ఉంది. ఫోన్‌లో సమస్యలను తెలిపినా పట్టించుకోవడంలేదని ఆయా కాలనీవాసులు వాపోతున్నారు. ప్రధాన మార్కెట్ ఏరియాలో, జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో చెత్తకుప్పలు పేరుకుపోవడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. వీధుల వెంట ఉన్న చెత్తకుప్పలను తొలగించి బ్లీచింగ్ చల్లించాల్సిన పారిశుద్ధ్య పర్యవేక్షకులు మొక్కుబడిగానే పని చేస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వీధుల వెంట ఉన్న చెత్త కుప్పలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.


వార్డు నం.22 మురుగు కాలువలో పెరిగిన మొక్కలు

వార్డు ఆఫీసర్ ఎవరో..


మా వార్డు ఆఫీసర్ ఎవరో ఇప్పటివరకు మాకు తెలియదు. వార్డులోని మురుగు కాలువల్లో పూడిక పేరుకుపోయి దుర్గంధం వ్యాపిస్తుంది. ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు. వార్డు ఆఫీసర్ ఒక్కసారి కూడా మా వార్డుకు రాలేదు.

– ఫైసల్ పటాన్, వార్డు నం.9

పట్టించుకోవడం లేదు


మా కాలనీల్లో మురుగు కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి మురుగు నీరు నిలిచిపోయిందని వార్డు ఆఫీసర్‌కు ఫోన్‌లో తెలియజేస్తే పట్టించుకోలేదు. కాలువల్లో మురుగు అలాగే ఉంది. దీంతో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుంది. అధికారులు స్పందించాలి. – సోను, వార్డు నం.8

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న బీజేపీ నాయకులు

చింతలమానెపల్లి: మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. లబ్ధిదారులకు మంజూరైన రూ.2లక్షల 26వేల విలువైన ఆరు చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే హరీశ్‌బాబు సిఫార్సుతో చెక్కులు మంజూరైనట్లు తెలిపారు. నాయకులు ఎల్ములె మల్లయ్య, చాప్లె సుధాకర్, డ్రేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 49 వెంటనే రద్దు చేయాలి

చింతలమానెపల్లి: పెసా చట్టం 1996 ప్రకారం జీవో 49ను రద్దు చేయాలని తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజరి సుగుణాకర్ డిమాండ్ చేశారు. బుధవారం తుడుందెబ్బ, రాయిసెంటర్, ఆదివాసీ సంఘ నాయకుల ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ మడావి దౌలత్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ భూసేకరణ, పునరావాస ప్రక్రియలో పెసా గ్రామసభలను సంప్రదించడం తప్పనిసరన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎవరినీ సంప్రదించకుండా జీవో తీసుకురావడం అన్యాయమన్నారు. ఆదివాసీ సంఘాల నాయకులు కుమురం కనకయ్య, ఏదుల సాగర్, కత్తర్ల భీమేష్, సిడాం పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

కుబేర యాగానికి తరలిన అర్చకులు

ఆసిఫాబాద్: హైదరాబాద్‌లోని కాజిగూడ తుల్జాభవన్‌లో రాష్ట్ర దూపదీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పంచకుండాత్మకండీ, కుబేర పాశుపత యాగానికి జిల్లా దూప దీప అర్చకులు బుధవారం తరలివెళ్లారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శిరీష్ శర్మ, కార్యదర్శి వారణాసి శ్రీనివాస్, తిరుపతి చారి, డిల్లీ విజయ్‌కుమార్, మసాదే రాంచందర్, రవీందర్ తదితరులు ఉన్నారు.

ఈవ్‌టీజింగ్‌పై విద్యార్థులకు అవగాహన

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మండలంలోని నజ్రుల్‌నగర్ విలేజ్ నం.12 ఉన్నత పాఠశాల విద్యార్థులకు షీటీం ఆధ్వర్యంలో డ్రగ్స్, ఈవ్‌టీజింగ్‌పై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలు ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగాం వినియోగంలో జాగ్రత్తలు వహించాలని, ఫొటోలు, వీడియోలు పోస్టు చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన చర్యలు తీసుకోవాలని సూచించారు. షీటీం సభ్యులు స్వప్న, రజిని, దినేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘కలెక్టర్ దృష్టికి సమస్య తీసుకెళ్తాం’


సమస్య తెలియజేస్తున్న మహిళలు

కెరమెరి: అన్ని అర్హతలు ఉండి రైతుభరోసా రాక ఇబ్బందులు పడుతున్న మండలంలోని పెద్ద కరంజివాడకు చెందిన పవార్ రేణుకాబాయి, పవార్ రేణుకలకు మానవ హక్కుల సంఘం జిల్లా చైర్మన్ రాథోడ్ రమేశ్ భరోసా ఇచ్చారు. ఏళ్లుగా ప్రభుత్వ పథకాలు అందక వారు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ఆయన బుధవారం వారి గ్రామానికి వెళ్లి వివరాలు సేకరించారు. వారి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. మహిళలు తెలిపిన వివరాల ప్రకారం.. వారి ఇరువురి భర్తలు తొమ్మిదేళ్ల క్రితం మృతి చెందగా భర్తల పేరిట ఉన్న అటవీహక్కు పత్రాలను తమ పేరిట విరాసత్ చేసుకున్నారు. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నేటి వరకు అందాల్సిన రైతుభరోసా అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు.

చందాలతో రోడ్డుకు మరమ్మతు


మరమ్మతులు చేస్తున్న గ్రామస్తులు

వాంకిడి: మండలంలోని ఆదివాసీ గ్రామాల ప్రజలు బుధవారం చందాలు వేసుకుని మట్టిరోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. వెల్గీ గ్రామపంచాయతీ పరిధిలో గల సోయంగూడ జీపీ కేంద్రం నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. అటు వైపు మూడు గ్రామాలు ఉండగా పూర్తిగా మట్టి రోడ్డే ఉంది. దీంతో సోయంగూడ, చిత్తరేట్, రింగారేట్ గ్రామస్తులు కలిసి చందాలు వేసుకుని బురద గుంతల్లో ఇసుకతో మరమ్మతులు చేపట్టారు. మొత్తం ఖర్చు దాదాపు రూ.60 వేల వరకు వచ్చిందని గ్రామస్తులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి బీటీరోడ్డు నిర్మించాలని వేడుకుంటున్నారు.